క్లుప్తంగా

అమరజీవి సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అమరజీవి పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయమని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ స్థాపన కమిటీ ఉపాధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని గంగినేని పార్కులో ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు భవిష్యత్ తరాల వారికి మార్గదర్శకమన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో కుప్పం రెడ్డమ్మ వ్యవస్థాపకులు రామలక్ష్మి, సభ్యులు పార్థసారథి నాయుడు, నాగరత్నం, సహదేవనాయుడు, గోవర్ధన్ బాబి పాల్గొన్నారు.

అమరజీవికి నివాళి

చిత్తూరు కార్పొరేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. ఆయన చేసిన కృషి, ప్రాణ త్యాగం గురించి కొనియాడారు. రాష్ట్ర అవతరణ కోసం నిస్వార్థంగా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ దీక్ష చేశారని గుర్తుచేశారు. ఆయన త్యాగం విలువ వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, గౌరీశంకర్, శేఖర్, రాజేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ప్రశాంత్ నగర్‌లో సమస్యల తిష్ట



యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో న్యూ ప్రశాంత్ నగర్‌లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని సీపీఎం జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్రన్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా న్యూప్రశాంత్ నగర్ కాలనీవాసులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కాలనీలో మురుగు నీటి కాలువలు లేకపోవడం మురుగునీరు రోడ్ల పైనే నిల్వ ఉంటోందన్నారు. శ్మశానవాటికకు భూమి లేకపోవడం, బస్సు సౌకర్యం, హెల్త్ క్లినిక్ తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అధికారిక యంత్రాంగం ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రియా, కళ, రాధమ్మ, గీతమ్మ, వెంకటేశు, రాజు తదితరులు పాల్గొన్నారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 18న స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో తిరుపతి అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పీపీఎస్ నిర్వాహకులు సుబ్రమణ్యం, నరసింహులులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరానికి హాజరయ్యే రోగులు ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులను తీసుకు రావాలని కోరారు. ఎంపికైన వారిని ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలియజేశారు.

బిజీ బిజీ



కలుపుతీత

బావులు, బోర్లలో నీరు ఉండడంతో రైతన్నలు అధికంగా వరిపంటను సాగుచేశారు. గుడిపాల మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా వరి మడులే కనిపిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా కూలీల ద్వారా వరిపంటలో కలుపుతీత పనులు మొదలెట్టారు. దీంతో పచ్చనికోక పరిచినట్టుగా ఉండే వరి పొలాల్లో కూలీలు, రైతన్నలు బిజీబిజీగా ఉన్నారు.

–గుడిపాల



చల్లని కుండ

వేసవి వచ్చిందంటే కుండలకు గిరాకీ పెరుగుతుంది. ప్రస్తుతం ఎండలు మొదలయ్యాయి. ఫ్రిజ్‌లో ఉన్న నీటి కన్నా కుండ నీరు తాగడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో కుమ్మరులు కుండల తయారీలో బిజీ బిజీ అయిపోయారు. మండలంలోని బండపల్లె, వసంతాపురం గ్రామాల్లో కుమ్మరులు కుండల తయారీలో మునిగిపోయారు.

–గుడిపాల

ఎక్కు.. తొలి మెట్టు

కొండను కొట్టు.. ఢీ కొట్టు

- ఆహార ప్రణాళికతో ఆరోగ్యం పదిలం
- హాల్‌టికెట్‌తో ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- నేటి నుంచి పది పరీక్షలు



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు (ఫైల్)

బంగారుపాళెం/గుడిపాల: విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలంటే పదో తరగతి తొలిమెట్టు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే జీవితంలో తొలి మెట్టు ఎక్కినట్టే. ఉజ్వల భవితకు పునాది వేసే టెన్త్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో హాజరైతే సగం విజయం సాధించినట్టే. ఇందుకోసం ఏడాది పాటు పరీక్షల కోసం విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టారు. అదీ చాలదన్నట్లు పరీక్షల సమయంలో రాత్రుల్లో సక్రమంగా నిద్ర పోకుండా చదువుతూ ఉంటారు. దీని వల్ల ఆరోగ్యం పాడవుతుంది. పరీక్షల సమయంలో శారీరక, మానసికంగా ఆరోగ్యాన్ని నియంత్రణలో పెట్టుకోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. ఆహార ప్రణాళిక, నిద్ర, వ్యాయామం తదితరాలు పాటిస్తే మంచి ఫలితాలు సాధ్యమని చెబుతున్నారు. సరైన తిండి, నిద్ర లేకపోతే ప్రతిభ కలిగిన విద్యార్థి సైతం సాధారణ విద్యార్థితో సమానం అవుతాడు. నియోజకవర్గం పరిధిలోని బంగారుపాళెం, పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, యాదమరి మండలాల్లో 2,350 మంది వరకు పదోతరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆహారం తీసుకోకుండా పరీక్షలకు వెళ్లడం వల్ల నీరసం వస్తుంది. కళ్లు తిరగడం, నిద్ర లేమి కారణంగా అలసట వస్తుంది. దీంతో పరీక్షలు రాయలేని పరిస్థితులను ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఉదయాన తప్పని సరిగా ఆహారం తీసుకుని పరీక్ష కేంద్రాలకు వెళ్లాలి. ఒత్తిళ్లను తట్టుకోవడానికి, జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి సమతుల్య ఆహారం ఎంతో అవసరమని చెబుతున్నారు.

హాల్ టికెట్ చూపిస్తే ప్రయాణం ఉచితం

నేటినుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి వీలుగా ఆర్టీసీ వారికి ఉచిత ప్రయాణం అందిస్తోంది. పరీక్షలు రాయడానికి వెళ్లేవారు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఏటా పదోతరగతి పరీక్షలు రాస్తుంటారు. వీరిలో చాలామంది సమీప గ్రామాల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో కొందరు, మరికొందరు ప్రైవేట్ వాహనాలపై ఆధార పడాల్సి ఉంటుంది. అయితే వీరిపై ఎటువంటి



ఆర్థికభారం పడకుండా ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. చిన్నారులకు ఆర్థిక భారం తగ్గించింది. మండలంలో 3 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 274 మంది ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. చిత్తూరు అర్బన్, రూరల్ మండలాల్లోని 23 పరీక్ష కేంద్రాల్లో 1,310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

సమతుల ఆహారాన్ని తీసుకోవాలి

పరీక్ష సమయంలో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఆయిల్, మసాలా, ఫ్రై పదార్థాలను ఎక్కువగా తీసుకోరాదు. పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ టైం మేలుకోకుండా.. నిద్ర సమయాన్ని పాటించాలి. పాలు, గంజి, పండ్లు, వాటి రసాలు తీసుకుంటే మంచిది. మానసిక ఏకాగ్రతను పెంచే వ్యాయామం చేపట్టాలి. కార్బోహైడ్రేట్లు లభించే పౌష్టిక ఆహారాన్ని సకాలంలో తీసుకోవాలి. కాఫీ, టీల జోలికి వెళ్లరాదు.

–డాక్టర్ శిరీష, ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి

ఒత్తిడికి దూరంగా ఉండాలి

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా రాయాలి. సబ్జెక్టు పరీక్షలకు మధ్య సెలవు ఉంటుంది. ఇది పరీక్షలకు ఎంతో ఉపయోగం. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రతి పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాం. ముందుగా తెలిసిన ప్రశ్నలకు కొట్టివేతలు లేకుండా సమాదానాలు రాయాలి. తరువాత తెలియని ప్రశ్నలకు బాగా ఆలోచించి సమాధానాలు రాసే ప్రయత్నం చేయాలి.

–నాగేశ్వర్‌రావు, ఎంఈఓ, బంగారుపాళెం

కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షలు

బంగారుపాళెం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ మండలంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణ కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బంగారుపాళెంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 810 మంది విద్యార్థులు నేటి నుంచి పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 582 మంది, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 228 మంది ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని అసౌకర్యాలను కల్పించినట్లు ఎంఈఓ తెలిపారు.

రెండు పరీక్ష కేంద్రాలు

యాదమరి: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష ఏ కేంద్రంలో 180 మంది విద్యార్థులు, పరీక్ష బి కేంద్రంలో 190 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఎండల దృష్ట్యా విద్యార్థులకు తాగునీటి సౌకర్యంతో పాటు ఆరోగ్య సదుపాయాలు కల్పించినట్లు మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

సకాలంలో చేరుకోవాలి

తవణంపల్లె: పదవ తరగతి విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తవణంపల్లె ఎంఈఓ హేమలత తెలిపారు. మండలంలోని అరగొండ, తవణంపల్లె హైస్కూల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండలంలో 377 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థులు 8.50 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షలు జరిగే వరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.



ఆలయంలోని క్యూలలో భక్తుల రద్దీ

బోయకొండ కిటకిట



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

చౌడేపల్లి: జిల్లాలో రెండవ పుణ్యక్షేత్రంగా భాసిల్లుత్ను బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసంతరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, పశు సంపద వృద్ధి చెందాలని పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. కోర్కెలు ఫలించిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

నోటీస్ బోర్డు

నేడు ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. గర్భిణులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎగువ వెంకటాపురంలో..

తవణంపల్లె: మండలంలోని ఎగువ వెంకటాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరుగుతుందని స్థానిక వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్పొరేషన్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తామన్నారు. ప్రజల నగర పరిధిలోని సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఆయన వివరించారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు అర్జీలు సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయను సూచించారు.

నేడు మొగిలిలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోషనివారణ పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకోవాలన్నారు.

23న మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం

పలమనేరు: ఈనెల 23న శ్రీరంగరాజపురం మండలంలోని ఆరిమాకులపల్లెలోని తెలుగు తల్లి కళా ప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం చేయనున్నట్టు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు నిర్వహించిన కథల పోటీల్లో గెలుపొందిన పది మంది రచయితలకు నగదు పురస్కారాలతో సత్కరించినట్టు తెలియజేశారు.

గుడిపాల మండలానికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంటినుంచే వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నాడు. తన ల్యాప్‌టాప్ నుంచి రమ్మీ ఆడటం మొదలెట్టాడు. జీతం అంతా తగలేస్తూ.. చివరికి అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకోనున్నట్లు వీడియో రికార్డు చేశాడు. చివరకు ఆ కుటుంబీకులు అప్పులు కట్టాల్సి వచ్చింది.

గుడిపాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు ఉదయం నుంచి రాత్రి వరకు ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడటం మొదలెట్టాడు. అందులో వచ్చిన మొత్తాన్ని మళ్లీ షేర్స్ కు మళ్లించాడు. అయితే ఆన్‌లైన్ గేమింగ్‌లో మొదట్లో కొంత వచ్చినట్లు కనపడినా తరువాత నష్టపోయాడు. చివరకు చిత్తూరు నగరంలో కట్టిన సొంత ఇంటిని సైతం అమ్ముకోవాల్సి వచ్చింది.

మరో గ్రానైట్ వ్యాపారి తరచూ ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడి పలువురి నుంచి అప్పులు చేసి మరీ ఆడాడు. చివరకు అప్పులు తీర్చలేక, బ్యాంకుల్లో తీసుకున్న రుణం కట్టలేకపోయాడు. తాజాగా తాకట్టు పెట్టిన ఇల్లు అమ్మకానికి రావడంతో చేసేది లేక అప్పు కోసం బంధువుల వద్ద కాళ్లావేళ్లా పడుతున్నాడు.



జీవితాలు.. పేకముక్కలు

- పల్లెలకు పాకిన ఆన్‌లైన్ గేమింగ్
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వైనం
- ఆత్మహత్యలకు దారితీస్తున్న వ్యసనం

గుడిపాల: సప్తవ్యసనాల్లో ఒకటి చతుర్ముఖ పారాయణం. ఆదేనండి పేకాట. ఒకప్పుడు సరదా కోసం మొదలైన పేకాట ఇప్పుడు వ్యసనంగా మారిపోయింది. ఈ ఆట మత్తులో జేబులు ఖాళీ చేసుకోవడమే కాదు జీవితాలను గుల్ల చేసుకుంటున్నారు. మండలం తమిళనాడుకు ఆనుకొని ఉండడంతో ఆన్‌లైన్ గేమింగ్ శరవేగంగా చెన్నై నుంచి పట్టణాలకు అక్కడి నుంచి పల్లెలకు పాకింది. స్మార్ట్‌ఫోన్‌తో కొంతసమయం దొరికితే చాలు యువత, విద్యార్థులు, ఉద్యోగులు సైతం ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్నారు. ఈ వ్యసనం బారిన పడిన వారు తమ పనులు వదిలేసి గంటల తరబడి ఈ ఆటకే సమయం కేటాయిస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలన్న అత్యాశతో యువకులు రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. అప్పులపాలై చివరకు వాటిని తీర్చేందుకు అడ్డదారులు తొక్కడం.. ఆత్మహత్యల వరకు దారి తీస్తున్నాయి.



ఆన్‌లైన్ గేమ్స్‌తో వచ్చే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆన్‌లైన్ రమ్మీ

మొబైల్, ల్యాప్‌టాప్‌ల్లో చిన్న తెరపై ఆడే 13 ముక్కల పేకాట వ్యసనం ఎంతో మంది యువతను నాశనం చేస్తోంది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ అయ్యి అకౌంట్ క్రియేట్ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో గేమ్‌లను ఆడేందుకు కొంత మొత్తాన్ని కష్టమర్లకు కంపెనీలు ఉచితంగా ఇవ్వడం ఆ డబ్బుతో ఆడుతూ, ఆ తరువాత ఆ ఆటలకు బానిసలుగా మారుతున్నారు. ఆ వైపు ఆడుతున్నది ఎవరో తెలియదు.. కానీ ఈ మాయా జూదంలో ఇటు వైపు ఆటగాళ్ల బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. చేతిలో ఉన్నది పోగొట్టుకొని ఇతరుల వద్ద అప్పుచేసి బంగారం, బైకులు తాకట్టుపెట్టి జూదమాడుతున్నారు. మొదట్లో ఒకటి, రెండు ఆటలు గెలవడం.. తరువాత ఓటమి తప్ప గెలుపే ఉండదు. దీంతో ఆ మాయలో పడిన యువత భవిత అంధకారంలోకి పోతోంది.

ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి



ఆన్‌లైన్ గేమ్‌ల బారిన పడి ఎంతోమంది యువత తమ విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలి. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. సరదాలకు పోయి యువత చేజేతులారా భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టుకుంటున్నారు.

- రామ్మోహన్, ఎస్‌ఐ, గుడిపాల

ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా చెట్లు నరికివేత



శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): ప్రభుత్వ స్థలాల్లో ఉన్న చెట్లను నరికి అక్రమార్కులు యథేచ్ఛగా సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం ప్రభుత్వ అధికారులు అందుబాటులో లేరని గుర్తించిన ఓ వ్యక్తి తమ సొంత పనుల నిమిత్తం ప్రభుత్వ స్థలంలో చెరువు కట్టపై ఉన్న చింత చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నట్లు ఎస్ఆర్ పురం గ్రామస్తులు తెలిపారు. అటవీశాఖ అధికారులకు మామూళ్లు చెల్లిస్తూ కూటమి నాయకుల అండతో కలపను సరిహద్దుల్లోని తమిళనాడు ప్రాంతానికి తరలించేస్తున్నారు. సీకే పురం పెద్ద చెరువు కట్టపై ఉన్న చింత చెట్టును నరుకుతున్నట్లు సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తప్పించుకోవడం గమనార్హం.